సాక్షి హనుమకొండ

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



రుణమాఫీకి కట్టుబడి ఉన్నాం..
రూ.రెండు లక్షల రైతు రుణమాఫీకి కట్టుబడి ఉన్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. - 8లో



నైపుణ్యంతోనే విధుల్లో రాణింపు
నైపుణ్యం ఉంటే ఏ పనిలోనైనా రాణిస్తారని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా అన్నారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం $34^0/25^0$
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత ఉంటుంది. రాత్రి సమయంలో పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రేపు పోలీస్ వాహనాల విడి భాగాలకు వేలం

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల విడి భాగాలు టైర్లు, బ్యాటరీలను ఈనెల 5న స్థానిక మోటారు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఎంజీఎం ఆస్పత్రి, ధర్మసాగర్ పీహెచ్‌సీ పరిశీలన



ఎంజీఎం: సీజనల్ వ్యాధుల విజృంభణ, మందుల సరఫరా, వైద్యుల విధులను పరిశీలించేందుకు ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డైరెక్టర్ హైమావతి గురువారం ఎంజీఎం ఆస్పత్రి, ధర్మసాగర్ పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న పడకలు, రోగులకు అందుతున్న వైద్యసేవలు, రిపోర్టింగ్ విధానం, ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. జనవరి నుంచి సెప్టెంబర్ వరకు నమోదైన డెంగీ, మలేరియా కేసుల వివరాలతోపాటు వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంజీఎం ఆస్పత్రి సూరింటెండెంట్ డాక్టర్ మురళి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్ మోహన్‌రావు, ఆర్‌ఎంఓ మురళి, ధర్మసాగర్ వైద్యాధికారి చందు తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రాన్ని సిద్ధం చేయండి




నయీంనగర్: కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అధికారులను ఆదేశించారు. 'కుడా' వైస్ చైర్‌పర్సన్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి గురువారం కళాక్షేత్రాన్ని ఆయన సందర్శించారు. కళాక్షేత్రంలో సిల్వర్ స్క్రీన్‌పై డాక్యుమెంటరీని వీక్షించారు. వీడియో, ఆడియోలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాళోజీ జీవిత ఘటనలు తెలిపే ఫొటో గ్యాలరీని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, హెచ్‌ఓ రమేశ్, ఏఈలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని షేక్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 5, 6 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. హనుమకొండలోని డీఎస్‌ఏ బాక్సింగ్‌హాల్‌లో జరిగిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 100 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన 11 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా నిర్వహణ కార్యదర్శి పోతరాజు రాజేందర్ తెలిపారు. బాక్సింగ్ అసోసియేషన్ బాధ్యులు పార్థసారథి, గిరిధర్, కృష్ణ, రఘు, కోచ్ ప్రభుదాస్, సీనియర్ బాక్సర్లు కృష్ణమూర్తి, రెబాన్, దివ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

కలెక్టర్లతో సీఎం, మంత్రి వీడియో కాన్ఫరెన్స్



వరంగల్: వానాకాలం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తదితర అంశాలపై హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్యశారద, హనుమకొండ నుంచి ప్రావీణ్య పాల్గొన్నారు. అనంతరం జరిగిన జిల్లా ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చెప్పిన అంశాలను వెల్లడించారు.

ఆధిపత్య పోరు



అధికార పార్టీలో ముదురుతున్న గ్రూపు రాజకీయాలు

- 'స్థానిక' ఎన్నికలే 'ఎర'గా చూపిస్తున్న వైనం
- నియోజకవర్గాల్లో వర్గాలుగా విడిపోయిన ముఖ్యనేతలు
- ఉనికి కోసం సీఎం, టీపీసీసీ నేతల పేర్లు.. దగ్గరంటూ అధికారుల వద్ద పైరవీలు
- ఎమ్మెల్యేలకూ కంట్లో నలుసులా కొందరు నేతలు
- అధిష్టానానికి చేరిన ఫిర్యాదులు
- ఉమ్మడి జిల్లా పాలిటిక్స్‌పై సీఎం దృష్టి.. నిఘా వర్గాల ద్వారా ఆరా

సాక్షిప్రతినిధి, వరంగల్ :

అధికార కాంగ్రెస్ పార్టీలో ఆధిపత్య పోరు రోజురోజుకు ముదిరిపోతోంది. ఓ వైపు సీనియర్ నేతల మధ్య గ్యాప్... మరోవైపు ఉనికి కోసం కొందరు నేతల గ్రూపు రాజకీయాలు ఆ పార్టీకి తలనొప్పిగా మారుతున్నాయి. ఆరు గ్యారంటీల అమలు, అభివృద్ధి పథకాలతో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేస్తుంటే.. కొందరు నాయకులు పైరవీలే పరమావధిగా ఆధిపత్యం కోసం పాకులాడుతుండటంపై కేడర్‌లో చర్చ జరుగుతోంది. సీఎం, టీపీసీసీ చీఫ్ పేర్లు వాడుకుంటుండడం.. సదరు నేతలు పలుచోట్ల ఎమ్మెల్యేలకూ సైతం కంట్లో నలుసులా మారుతున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు నేరుగా, కీలక నేతల ద్వారా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా.. సీఎం నిఘా వర్గాల ద్వారా నివేదికలు తెప్పించుకునే పనిలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

పార్టీ పెద్దల పేర్లు.. అధిష్టానానికి ఫిర్యాదులు..

పాలకుర్తి, డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో పీసీసీ కార్యదర్శి హోదాతో ఓ నేత సొంత వర్గాన్ని పెంచిపోషిస్తుండటాన్ని ఎమ్మెల్యేలు జీర్ణించుకోవడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు అత్యంత దగ్గర అని చెప్పుకుంటూ కాంగ్రెస్‌లో మరో అధికార కేంద్రాన్ని తయారు చేస్తున్న సదరు నాయకుడు మూడు నియోజకవర్గాల్లో తరచూ పర్యటనలు, సొంతంగా కార్యక్రమాలు నిర్వహించడం ఎమ్మెల్యేలకు కంట్లో నలుసులా మారింది. సదరు నేత వైఖరిపై ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి ఇప్పటికే ఆ మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష పదవి తనదే అని చెప్పుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు కూడా తానే ఇవ్వనున్నట్లు కేడర్‌ను మభ్యపెడుతున్నట్లు ఇటీవల వరంగల్‌లో జరిగిన ఓ సమావేశం సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం చర్చనీయాంశం అవుతోంది. ఇదిలా ఉండగా ఇప్పటికే అభివృద్ధితోపాటు ఉమ్మడి వరంగల్ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి తాజా పరిస్థితులపై ముఖ్యనేతలను ఆరా తీశారు. ఇదే సమయంలో ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలపై నివేదికలు పంపే పనిలో పడ్డాయి.

అందరూ కలిసున్నట్లే.. అంతర్గత కలహాలే...

- కాంగ్రెస్ పార్టీలో ముఖ్యనాయకులు, నేతల నడుమ వైరుధ్యాలు సద్దుమణగడం లేదు. అధిష్టానం దృష్టిలో అందరూ కలిసున్నట్లు కనిపిస్తున్నా.. చాలాచోట్లా 'ఎవరికీ వారే యమునా తీరే'లా వ్యవహరిస్తున్నారు. కీలక నేతల మధ్య రోజురోజుకూ అంతర్గత కలహాలు పెరుగుతున్నాయి.
- వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది.
- వరంగల్ తూర్పులో బయటకు బాగానే కనిపిస్తున్నా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి మధ్య సఖ్యత లేదన్న వాదన కేడర్‌లో ఉంది. ఫలితంగా ద్వితీయశ్రేణి నాయకులు కూడా గ్రూపులుగా చీలిపోయి ఉన్నారు.
- వరంగల్ పశ్చిమలో నాయిని రాజేందర్, టికెట్ ఆశించి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవితో సరిపెట్టుకున్న జంగా రాఘవరెడ్డి కేడర్ కూడా రెండుగానే ఉన్నాయి.
- వర్ధన్నపేటలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ నమిండ్ల శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కలిసి పనిచేస్తున్నట్లున్నా.. కార్యకర్తలు జట్లు జట్లుగానే తిరుగుతున్నారు.
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి (బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు), కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసి ఓడిన సింగాపురం ఇందిర వర్గాలు నిప్పు, నీరులా ఉన్నాయి.
- జనగామ నియోజకవర్గంలోనూ గ్రూపుల పోరు పోలీస్‌స్టేషన్ దాకా వెళ్లింది.
- పరకాల నియోజకవర్గంలో గీసుకొండ మండల నాయకుల వ్యవహారం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య గ్యాప్‌ను పెంచింది.

ఒకకార్డు.. బహుళ ప్రయోజనాలు



ఓ కుటుంబం నుంచి వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఒకేకార్డు అనేక ప్రయోజనాల నినాదంతో ప్రజల సంక్షేమం కోసం ఫ్యామిలీ డిజిటల్ యూనిక్ కార్డుకు శ్రీకారం చుట్టారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేట దర్గా రామాలయం వీధి తండాలో గురువారం సాయంత్రం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆయన డిజిటల్ కార్డు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో 48, 10వ డివిజన్లు పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపికయ్యాయని తెలిపారు. ఈ డిజిటల్‌కార్డు రేషన్, ఆరోగ్యశ్రీ, రైతుబీమా, రైతు భరోసా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్ వంటి ప్రజా సంక్షేమ పథకాలకు ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. డిజిటల్ కార్డు పొందిన తర్వాత రేషన్‌తోపాటు ఇతర సంక్షేమ ప్రయోజనాలు ఎక్కడినుంచి అయినా పొందవచ్చన్నారు. కలెక్టర్ ప్రావీణ్య కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ డిజిటల్ సర్వేలో ప్రజలు డేటాలో తప్పిదాలు ఉంటే సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎన్.వెంకటేశ్, బల్దియా డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసీల్దార్ భావుసింగ్, కార్పొరేటర్ సర్తాజ్ బేగం, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమాలు

హన్మకొండ: సామ్రాజవాదానికి వ్యతిరేకంగా, కార్మికవర్గ ఐక్యత కోసం, ప్రపంచ కార్మికులను ఐక్యం చేస్తూ, వారి హక్కుల కోసం ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ) నిరంతరం పోరాటాలు చేస్తోందని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఐదు రోజులు, 35 గంటల పని దినం కోసం ప్రపంచవ్యాప్తంగా పోరాటాలు నడుస్తున్నాయని చెప్పారు. సామ్రాజ్యవాదం, బహుళజాతి కంపెనీలు కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, నాయకులు పుల్లా అశోక్, బొల్లారం సంపత్, యాకయ్య, నవనీత, మల్లయ్య, ఎం.శ్రీనివాస్, నాగరాజు, రమ, సునీత పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు షురూ

- భద్రకాళి ఆలయం, వేయిస్తంభాల ఆలయంలో ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- బాలాత్రిపురసుందరిగా అమ్మవారికి అలంకరణ



భద్రకాళి ఆలయంలో వృద్ధి హోమ పూజలు చేస్తున్న అర్చకులు



మృగవాహన సేవలో అమ్మవారు..



వేయిస్తంభాల గుడిలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ కల్చరల్: వరంగల్‌లోని భద్రకాళి దేవాలయం, హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. భద్రకాళి ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ఈఓ శేషు భారతి, పర్యవేక్షకుడు అద్దంకి విజయ్‌కుమార్ అమ్మవారికి ఆభరణాలను ధరింపజేశారు. అనంతరం అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని శైలపుత్రి క్రమంలో వృషభ వాహనంపై, ప్రదోష కాలంలో యోగనిద్ర క్రమంలో మృగవాహనంపై ఊరేగించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాత్రి 9 గంటలకు మహాపూజ, కుమారి, సుహాసిని పూజలు చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యే సతీమణి నీలిమ, కుమార్తె పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయంలో..

వేయిస్తంభాల ఆలయంలో ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మూలగణతికి అభిషేకం, రుద్రేశ్వరుడికి నవరసాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. రుద్రేశ్వరీదేవి ఉత్సవ విగ్రహాన్ని మండపంలో ప్రతిష్ఠించారు. అమ్మవారిని శ్రీబాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమ దంపతులు స్వామివారికి రుద్రార్చన చేశారు. సీఎంఆర్ గ్రూప్స్ ఆధ్వర్యంలో నిత్యాన్నప్రసాదాల వితరణ ప్రారంభించారు. సాయంత్రం బత్తిని శ్రీనివాస్ సౌజన్యంతో బొడిగె లక్ష్మీనారాయణ భాగవతార్ హరికథా కాలక్షేపం అలరించింది. మహిళలు రెండో రోజు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో విగ్రహదాత పల్లం రమేశ్, కొటిల్‌రెడ్డి, తోట పవన్, నాయిని లక్ష్మారెడ్డి, మధు, కోన శ్రీకర్, పులి రజినీకాంత్, సుదర్శన్, భక్తులు పాల్గొన్నారు.

శైలపుత్రి అలంకరణలో భ్రమరాంబిక



ఐనవోలు: మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి వేకువజామున సుప్రభాతసేవ, విఘ్నేశ్వర పూజ, శైవశుద్ధి, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, రుత్విక్ వరుణ దీక్షాధారణ, అఖండ దీపారాధన, త్రిశూలపూజ, అంకురారోపణ, మంటపారాధన, ప్రధాన కలశస్థాపన నిర్వహించి నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేసినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. 9 రోజులపాటు అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పలువురు భక్తులు అమ్మవారి దీక్ష స్వీకరించినట్లు ఈఓ చెప్పారు. వేడుకల్లో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండిట్ విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు భాను ప్రసాద్, నరేశ్, మధు, శ్రీనివాస్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



వెల్‌కం ఫ్రెషర్స్..

ఎస్సార్ యూనివర్సిటీలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాంప్ వాక్ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. - 8లో

డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కాంగ్రెస్

బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్, పక్కన మాజీ ఎమ్మెల్యేలు నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

హన్మకొండ: ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ధ్వజమెత్తారు. బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని విమర్శించారు. మూసీ అభివృద్ధి పేరుతో కూలుస్తున్న ఇళ్లను చూసి ఏడుస్తున్న మహిళలకు అండగా నిలిచిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై మంత్రి కొండా సురేఖ విమర్శలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆ వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకుని కేటీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మీ చరిత్ర, మీ కుటుంబ చరిత్ర అందరికీ తెలుసునని, మంత్రి హోదాలో ఉండి ఇతరుల కుటుంబాల విషయాలు మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖ మాటలు ఆమె ధోరణికి అద్దం పడుతున్నాయని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, ఇమ్మడి లోహిత, సోదా కిరణ్, పులి రజినీకాంత్, నయీముద్దీన్, మేకల బాబురావు పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి

- కేడీసీసీబీ డైరెక్టర్ పొరండ్ల కృష్ణప్రసాద్
- చేనేత కార్మికులకు రూ.23.76 లక్షల థ్రిఫ్ట్ ఫండ్ పంపిణీ



చేనేత కార్మికులకు థ్రిఫ్ట్ ఫండ్ పంపిణీ చేస్తున్న కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్

కమలాపూర్: దేశంలో వ్యవసాయం తర్వాత అతి పెద్దదైన చేనేత రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మర్రిపల్లిగూడెం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు, కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ పొరండ్ల కృష్ణప్రసాద్ కోరారు. మర్రిపల్లిగూడెం చేనేత సహకార సంఘంలో పనిచేస్తున్న 47 మంది చేనేత కార్మికులకు నేతన్నకు చేయూత పథకం కింద ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.23,76,700 థ్రిఫ్ట్ ఫండ్, ఇటీవల మృతి చెందిన చేనేత కార్మికుడు చిందం అశోక్ కుటుంబానికి చేనేత బీమా పథకం కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కులను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులతో కలిసి ఆయన కమలాపూర్‌లో మాట్లాడారు. మగ్గం నేసే చేనేత కార్మికులకు గత ప్రభుత్వం ఇచ్చినట్లుగా నెలకు రూ.2 వేలు, రాట్నం చుట్టే కార్మికులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఇవ్వాలని కోరారు. చేనేత కార్మికులకు థ్రిఫ్ట్ ఫండ్ విడుదల చేసిన చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజారామయ్యార్‌కు చేనేత కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ రియాజ్, మేనేజర్ శ్యాం, బ్యాంకు సిబ్బంది ప్రశాంత్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

విద్యారణ్యపురి: డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ రెండో రోజు గురువారం హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగింది. ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్ల కేడర్‌లో ఒక్కో పోస్టుకు ముగ్గురు అభ్యర్థుల చొప్పున సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచారు. కొన్నింటిలో ఒక్కో పోస్టుకు ఒకరుఇద్దరు మాత్రమే ఉన్నారు. దీంతో 187 టీచర్ పోస్టులకు 448 మందిని సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచారు. గురువారం సాయంత్రం వరకు 233 మంది అభ్యర్థులు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారని డీఈఓ వాసంతి తెలిపారు. ఈనెల 4, 5వ తేదీల్లోనూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగనుందని పేర్కొన్నారు.

ఎంపీడీఓ ఆఫీస్ తరలింపునకు కసరత్తు

ఐనవోలులో భవనాలను పరిశీలించిన అధికారులు



సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత, స్కూల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సరిత

ఐనవోలు: కలెక్టర్ చొరవతో ఐనవోలులో మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి అడుగులు పడుతున్నాయి. హనుమకొండలో ఎంపీడీఓ కార్యాలయం ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 'సాక్షి'లో పలుమార్లు కథనాలు వచ్చిన విషయం విదితమే. ఇటీవల కలెక్టర్ ప్రావీణ్య వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి మండలానికి వచ్చారు. ఎండీపీఓ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మించేవరకూ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఏర్పాటు చేయాలని స్థానికులు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ద్వారా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో అక్కడే ఉన్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లుతో కలెక్టర్ మాట్లాడారు. ఐనవోలులోనే మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి ఉత్తర్వులు ఇస్తానని చెప్పి వెళ్లారు. అందులో భాగంగా గురువారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్, ఎమ్మార్సీ భవనాలను జెడ్పీ సీఈఓ విద్యాలత, స్కూల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సరిత పరిశీలించారు. అధికారుల నివేదిక ఆధారంగా మండల పరిషత్ కార్యాలయం తరలించేందుకు కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, ఎంపీఓ రఘుపతిరెడ్డి తెలిపారు.

కాజీపేట-దాదార్ మధ్య 26 ప్రత్యేక రైళ్లు - 8లో

నైపుణ్యంతోనే విధుల్లో రాణింపు

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



పోలీస్ డ్యూటీ మీట్‌ను పరిశీలిస్తున్న సీపీ

వరంగల్ క్రైం : నైపుణ్యం ఉంటే ఏ పనిలో అయినా రాణిస్తారని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీల్లో వరంగల్ కమిషనరేట్, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ డ్యూటీ మీట్ పోటీలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం సీపీ ప్రారంభించారు. పోలీసులు నిరంతరం నిర్వహించే విధులకు సంబంధించి కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, వీడియోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో విభాగాల వారీగా రాణించిన వారిలో ఇద్దరి చొప్పున హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ప్రథమ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు పోలీస్ అధికారులు వృత్తి నైపుణ్యం సాధించడం ద్వారా, నేరస్తులను త్వరితగతిన గుర్తించడంతో పాటు ప్రజలకు సత్వరమే న్యాయం అందించగలరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, జోనల్‌కు చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.8.91లక్షల విలువైన పొగాకు ఉత్పత్తుల పట్టివేత

- టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా బ్యాగులు, ఓమ్ని వ్యాన్

వరంగల్: ఏనుమాముల ఎస్టీఆర్‌నగర్‌లోని ఓ ఇంటిపై దాడి నిర్వహించి రూ.8.91 లక్షల విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులు గుట్కా, జర్దాతో పాటు ఒక ఓమ్ని వ్యాన్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ గురువారం తెలిపారు. ఈదాడుల్లో గుట్కా సరఫరా చేస్తూ విక్రయిస్తున్న హుజూరాబాద్‌కు చెందిన రావి శ్రీధర్, ఎస్టీఆర్‌నగర్‌కు చెందిన పాన్‌షాపు యాజమాని గుండ కృష్ణను అదుపులోకి తీసుకుని తదుపరి చర్యల నిమిత్తం ఏనుమాముల పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఈదాడుల్లో ఏనుమాముల ఎస్సై పోగుల శ్రీకాంత్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజు, ఆర్ఎస్సై ఓరుగంటి భానుప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

రూ.9200 విలువైన అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవికుమార్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు వరంగల్ లక్ష్మీపురంలో అంబి ఉమ, అంబి లత ఇంటిపై దాడి చేయగా ఈ మద్యం లభించిందన్నారు.



కాళ్లు చచ్చుబడినా.. సడలని సంకల్పం

సిట్టింగ్ పారా త్రోబాల్‌లో రాణిస్తూ ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపికైన క్రిష్ణవేణి

- దాతలు ముందుకు వస్తేనే.. అంతర్జాతీయ వేదికపై తలపడేది..
- ఫ్లైట్ టికెట్, ఇతర వాటికి రూ.లక్షకు పైగానే ఖర్చు
- ఆదుకోవాలని వేడుకుంటున్న క్రిష్ణవేణితోపాటు ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులు, క్రీడాభిమానులు

జనగామ : ఆ క్రీడాకారిణికి పుట్టుకతోనే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి.. పైగా నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు కూలి పనికి వెళ్తేనే పూట గడిచేది. లేదంటే పస్తులుండే పరిస్థితి. అయినా జీవన ప్రయాణంలో ఏమాత్రం అధైర్య పడలేదు. కృంగిపోలేదు. మొక్కవోని సంకల్పంతో ముందుకుసాగింది. ఆ సంకల్ప బలమే నేడు ఆమెను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత చదువులు పూర్తి చేసుకుని ఇంటర్నేషనల్ సిట్టింగ్ పారా త్రోబాల్ పోటీలకు దేశం తరపున ఎంపికై తెలంగాణ ఆణిముత్యంగా నిలిచింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఘన కీర్తి సాధించి ప్రపంచ స్థాయి పోటీలకు ఎంపికైంది. అయితే నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక కారణాలు అడ్డువస్తున్నాయి. ఫలితంగా అంతర్జాతీయ పోటీల్లో తన సత్తాను చాటుకోలేకపోతోంది. ఆమె జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ శివునిపల్లి -విశ్వనాథపురానికి చెందిన దివ్యాంగురాలు మాచర్ల క్రిష్ణవేణి. గతేడాది థాయ్‌లాండ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సిట్టింగ్ పారా త్రోబాల్ పోటీలకు దేశం తరపున అవకాశం వచ్చినా ఫ్లైట్ టికెట్‌కు సైతం డబ్బులు లేకపోవడంతో వెళ్లేలేక పోయింది. ఈదఫా మరోసారి ఇంటర్నేషనల్ పోటీల్లో పాల్గొనే సదవకాశం వచ్చినా.. ఆర్థిక వనరులు లేక.. దాతల సాయం కోసం వేడుకుంటోంది.



కంబోడియా దేశంలో జరిగే గ్రూపింగ్ పారా త్రోబాల్‌కు ఎంపికైన క్రిష్ణవేణి

ఇంటర్నేషన్‌లో పోటీల్లో మరోసారి దేశం తరపున పాల్గొనే అవకాశం..

శివునిపల్లికి చెందిన మాచర్ల ఎల్లయ్య కూతురు క్రిష్ణవేణి పుట్టకతోనే దివ్యాంగురాలు. అయినా ఆ తండ్రి కూతురును బాగానే చదివించారు. ఎంబీఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసి ప్రస్తుతం ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖలో అకౌంటెంట్‌గా పని చేస్తూనే.. తనకు నచ్చిన సిట్టింగ్ పారా త్రోబాల్‌లో శిక్షణ పొందారు. జిల్లా, రాష్ట్రం, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ ఇంటర్నేషనల్ స్థాయికి ఎదిగారు. ఆరు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో పోషణ గడవడమే కష్టంగా మారిన సమయంలో సిట్టింగ్ పారా త్రో బాల్(గ్రూప్ గేమ్) అంతర్జాతీయ చాంపియన్ షిప్‌లో దేశం తరపున మరోసారి పాల్గొనేందుకు తెలంగాణ నుంచి క్రిష్ణవేణి ఒక్కరికే పిలుపు వచ్చింది. డిసెంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు కంబోడియాలోని నేషనల్ మల్టీపర్పస్ స్టేడియంలో జరిగే సిట్టింగ్ పారా త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు క్రిష్ణవేణికి పారాత్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఆర్) కమిటీ సమాచారం అందించారు. ఇందులో పాల్గొనేందుకు సొంత ఖర్చులు భరించాలని లేఖలో పేర్కొన్నారు. ఫ్లైట్ టికెట్, హోటల్ వసతి, 8 రోజుల పాటు ఆహారం, ప్రవేశ రుసుం, ట్రాక్‌సూట్, బ్లేజర్, టీ షర్టులు ఇలా తదితర ఖర్చుల కోసం రూ.లక్ష వరకు ఖర్చు ఉంటుందని నిర్వహణ కమిటీ తెలిపింది. ఇందులో ఈ నెల15వ తేదీ లోపు రూ.35 వేలు, నవంబర్ 15లోపు మరో రూ.54 వేలు పంపించి బెర్త్ కన్ఫామ్ చేసు కోవాల్సి ఉంటుంది. సంకల్ప బలంతో చదువుతో పాటు అథ్లెటిక్స్, పారాత్రోబాల్ ఆటల్లో రాణిస్తున్న క్రిష్ణవేణి.. ప్రపంచ స్థాయిలో దేశ గౌరవాన్ని మరింత పెంచేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే దాతల సాయం అవసరం. డిసెంబర్‌లో కంబోడియాలో జరిగే ఇంటర్నేషనల్ పోటీల్లో క్రిష్ణవేణి పాల్గొనేందుకు దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దాతలు ఈ అడ్రస్‌కు ఆర్థిక సాయం పంపించాలని క్రిష్ణవేణితోపాటు ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులు, క్రీడాభిమానులు వేడుకుంటున్నారు.

> మాచర్ల క్రిష్ణవేణి, క్రీడాకారిణి,
> విశ్వనాథపురం, స్టేషన్‌ఘన్‌పూర్
> ఫోన్ పే నంబర్: **9666196928**
> ఎస్‌బీఐ ఖాతా నంబర్: **62259931738**
> ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్ **0021353**
> స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి
> జిల్లా: జనగామ

కాలు కోల్పోయినా.. కఠోర సాధనతో ముందుకు

- అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ త్రోబాల్ పోటీలకు ఎంపికైన జ్యోతి
- ఆర్థిక వనరులు లేక పోటీల నుంచి వైదొలిగే ఆలోచన
- దాతలు స్పందించి ఆదుకోవాలని వేడుకోలు..
- సాయం చేస్తే దేశానికి పేరు తీసుకొస్తానంటున్న క్రీడాకారిణి



తల్లిదండ్రులతో జ్యోతి

పలిమెల : ఓ క్రీడాకారిణి తన చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయింది. అయినా ఏమాత్రం నిరాశ చెందలేదు. అంగవైకల్యం అనే మాటను దరిదాపుల్లోకి రానీయకుండా చదువుతో పాటు క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తోంది. ఆమె పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి. జ్యోతి.. సెప్టెంబర్ 22 నుంచి 26వ తేదీల్లో జార్ఖండ్‌లో జరిగిన జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ త్రోబాల్ పోటీల్లో పాల్గొంది. ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ త్రో బాల్ పోటీలకు ఎంపికైంది. డిసెంబర్‌లో కంబోడియాలో జరిగే ఈ అంతర్జాతీయ క్రీడలలో పాల్గొననుంది. అయితే ఈ క్రీడల్లో పాల్గొనేందుకు రూ.1.20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అక్టోబర్ 15వ తేదీలోగా రూ.50 వేలు చెల్లిస్తేనే అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు అర్హత ఉంటుంది. నిరుపేద కుటుంబానికి చెందిన జ్యోతి అంతర్జాతీయ క్రీడలకు ఎంపికైన ఆనందం ఉన్నా ఖర్చులకు డబ్బులు లేక వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. తల్లిదండ్రులు కావేరి బుచ్చయ్య, లక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీలు. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి వారిది. తమ కూతురు అంతర్జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైందని తెలిసినా పేదరికం వారి ఆనందానికి అడ్డు వస్తోంది. దాతలు స్పందించి సాయం చేస్తే తమ కూతురు దేశం తరపున పాల్గొని పతకం తీసుకొస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దాతలు స్పందించి ఫోన్ పే నంబర్: **9392993323** కు సాయం చేయాలని వారు కోరుతున్నారు.

దాతలు సాయం చేస్తే దేశానికి పేరు తీసుకొస్తా..



డిసెంబర్‌లో కంబోడియాలో జరిగే పారా అథ్లెటిక్స్ త్రోబాల్ పోటీలకు దేశం తరపున ఎంపికైన ముగ్గురిలో నేను కూడా ఉన్నా. కానీ దేశం దాటి వెళ్లి ఆడే ఆర్థిక స్థోమత లేదు. నా చిన్నప్పుడే కాళ్లు పోగొట్టుకున్నా. అయితే ధైర్యం కోల్పోకుండా క్రీడల్లో కనబరుస్తున్నా. అయితే ఆర్థిక కారణాలతో ప్రస్తుతం అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ఈ అవకాశం కోల్పోతానని భయంగా ఉంది. దాతలు సహకరిస్తే దేశం తరపున ఆడి పేరు తీసుకువస్తా.

- కావేరి జ్యోతి, పారా క్రీడాకారిణి

ముసలమ్మకుంట గోదాంకు మామిడి మార్కెట్

వరంగల్ : వరంగల్‌లోని లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తున్నందున ఈ ఏడాది మామిడి సీజన్ నిర్వహణ కోసం ఏనుమాముల ముసలమ్మకుంట పక్కనే ఉన్న స్థలాన్ని మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల, చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ముసలమ్మకుంట పక్కన మార్కెట్‌కు సంబంధించిన 10ఎకరాల స్థలంలో మార్కెట్‌కు సంబంధించిన గోదాంను నిర్మించారు. ప్రహరీ ఉండడంతో మామిడి సీజన్‌లో క్రయ, విక్రయాలు జరిపేందుకు అనుకూలంగా ఉంటుందని పండ్ల మార్కెట్ వ్యాపారులు సూచించడంతో చాంబర్ ప్రతినిధులు, మార్కెట్ అధికారులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పండ్ల మార్కెట్ వ్యాపారుల అధ్యక్షుడు వెల్ది సాంబయ్య, చాంబర్ నాయకులు సాగర్ల రవి, వ్యాపారులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీలో అడ్మిషన్లు కల్పించాలి

- పురుగుమందు డబ్బాలతో.. సెల్‌టవర్ ఎక్కి అభ్యర్థుల నిరసన

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ రెండో కేటగిరీలో తమకు అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఐదుగురు అభ్యర్థులు గురువారం పురుగుమందు డబ్బాలతో పరిపాలన భవనం వద్ద నిరసన తెలిపారు. ప్రవేశాలు కల్పించని పక్షంలో తాము ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. కాగా ఓ అభ్యర్థి చేతిలోని పురుగుల మందు డబ్బాను రిజిస్ట్రార్ మల్లారెడ్డి, మరో ఇద్దరి వద్ద ఉన్న డబ్బాలను సెక్యూరిటీ సిబ్బంది లాక్కున్నారు. పీహెచ్‌డీ సీట్లను పెంచి తమకు అడ్మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనంతరం పరిపాలన భవనంపై ఉన్న సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి వచ్చి వారిని కిందికి దిగేలా చేశారు. అనంతరం రిజిస్ట్రార్ చాంబర్‌కు రాగా అధికారులు, రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడారు. ఇప్పటికే పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందని తెలిపారు. ఎలాగైనా తమకు పీహెచ్‌డీలో అడ్మిషన్లు కల్పించాల్సిందేనని అభ్యర్థులు పట్టుబట్టారు. దీంతో సమస్యను ఇన్‌చార్జ్ వీసీ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. నిరసన తెలిపిన వారిలో మంద నరేశ్, బందీగా రాకేశ్, తిరుపతినాయక్, సారుపాక అనిల్ ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తానేదార్‌పల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్(55) గీత వృత్తితోపాటు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి ప్లాట్ కొనుగోలు చేసేందుకు ఏడాది క్రితం రూ.5లక్షలు అప్పు చేశాడు. అదేవిధంగా ఈ ఏడాది వ్యవసాయ భూమి వద్ద చదును చేయడం, సాగునీటి కోసం పైపులైన్ వేసేందుకు రూ.3లక్షలు అప్పు చేశాడు. మొత్తం రూ.8లక్షల అప్పు అయ్యింది. ఈ అప్పు ఎలా తీర్చాలని కుటుంబ సభ్యులతో చెబుతూ ఆవేదన చెందేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాస్ తాను అద్దెకుంటున్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సరోజన, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ
- వందశాతం సబ్సిడీపై చేప పిల్లల పంపిణీ

ఖిలా వరంగల్ : మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈమేరకు గురువారం వరంగల్ ఉర్సు కరీమాబాద్ రంగ సముద్రం చెరువులో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో వంద శాతం రాయితీపై ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ సత్యశారదతో కలిసి ప్రారంభించారు. అనంతరం 25వేల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం వరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో వెలుగులు నింపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల్లో చేప పిల్లలు పోసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈఏడాది భారీ వర్షాలతో చెరువులన్నీ జలకళ సంతరించుకున్న నేపథ్యంలో మత్స్యకారుల ఇళ్లలో సిరులు కురవాలని ఆకాంక్షించారు. రంగ సముద్రంలోని గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు తొలగించి చెరువులను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సత్యశారద మాట్లాడారు. 2024–25 సంవత్సరానికి జిల్లాలోని 707 చెరువులు, ఒక రిజర్వాయర్‌లో 194.127 లక్షల చేపపిల్లలు వంద శాతం సబ్సిడీపై పంపిణీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అదేవిధంగా వంద శాతం సబ్సిడీపై నాలుగు చెరువుల్లో 12.14 లక్షల రొయ్య పిల్లలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఈ కార్యకరమంలో మత్స్యశాఖ అధికారి నాగమణి, కార్పొరేటర్లు మరుపల్లి రవి, చింతాకుల అనిల్, కాంగ్రెస్ నేతలు మీసాల ప్రకాశ్, కేడల పద్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ సత్యశారదతో కలిసి చేప పిల్లలు వదులుతున్న మంత్రి కొండా సురేఖ

రూ.2లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉన్నాం

- రైతు సంక్షేమానికి పెద్దపీట
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

పర్వతగిరి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉందని, కొంత ఆలస్యమైనా రుణమాఫీ చేసి తీరుతామని, గతంలో ఎన్నడూ లేని విధంగా రైతు సంక్షేమానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చౌటపల్లి గ్రామంలో ప్యాక్స్ నూతన భవనం, 500 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి శంకుస్థాపనసతో పాటు మండలంలో వివిధ పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, ఎంపీ కడియం కావ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్ష రుణమాఫీని పలు దఫాలుగా మాఫీ చేశామని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్షలాది మంది రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశారన్నారు. ఈ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మరికొంత మందికి వివిధ సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ చేయలేకపోయామని, త్వరలో పూర్తిస్థాయిలో చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. కాగా, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు.. బతుకమ్మ అంటే ఆడ పడుచుల పండుగని మంత్రి సీతక్క, ఎంపీ కడియం కావ్యకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, స్టేట్ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ప్యాక్స్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పార్టీ సభగా మారిన పీఏసీఎస్ సభ..

పార్టీలకతీతంగా ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి పనుల కోసం ఏర్పాటు చేసిన సభను పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ జోక్యం చేసుకుని పార్టీ సభగా మార్చారనే విమర్శలు వెల్లువెత్తాయి. మంత్రి సీతక్కను కలిసి తమ ఆవేదన తెలిపేందుకు వస్తే నాయకులు అవమాన పరిచారని అంగన్‌వాడీ కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు తెలిపారు.

S.R.R. COLLEGE OF PHARMACEUTICAL SCIENCES
Affiliated to K.U., Approved by PCI, New Delhi & Govt. of Telangana
Vill: Valbhapur, Elkathurthy (M), Hanumakonda-Dist-505 476
Cell: 9866108056, 9959029009

B-CATEGORY ADMISSION

Applications are invited from eligible candidates for admission into the following courses under Category-B Seats for the academic year 2024-25.

COURSE	INTAKE	'B' CATEGORY SEATS (30%)	EAMCET CODE
B.Pharmacy	100	30	SRCP
Pharm.D	30	09	SRCP
M.Pharmacy (Pharmaceutics)	15	04	SRCP1
M.Pharmacy (Pharmacology)	15	04	SRCP1
M.Pharmacy (Pharmaceutical Analysis)	15	04	SRCP1

Applications can be either obtained free of cost from the Institute on all working days between 9.30 AM - 4.30 PM or download from the website www.srrcopsc.org. The filled in application should reach on or before 07-10-2024. Admissions are made as per Govt. of Telangana.

Secretary

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

- ఓగ్లాపూర్ పవర్‌గ్రిడ్‌కు ఎదురుగా 200 ఫీట్ రోడ్డుకి ఆనుకొని కాంపౌండ్ కట్టి ఉన్న ప్లాటు (వెడల్పు 30 పొడవు 120) 400 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9701218888. [W-1237310]

WANTED

- Wanted Lab Technician & M.Pharm / Pharm.D / B.Pharm. D / B. Pharm Graduate Female for Clinic in Hanamkonda. Ph: 9494970980. [W-1239918]
- AD GROUP of Companies Wanted Sales Executive (Male), AutoCad Designer (Female), Social Media & Digital Marketing (Female) min 1 Year Experience. Cell: 9550487037. [W-1264999]
- మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/-. ఫోన్ : 70756 56208 [V-6570]
- మహబూబాబాద్‌లో మా షోరూం నందు పని చేయుటకు లేడీ వర్కర్స్ కావలెను. వివరాలకు సంప్ర. సెల్ : 9391 325 192 [M-1185323]
- పోచంమైదాన్ నక్కలగుట్ట ఏరియాలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ షోరూంలో పని చేయుటకు హెల్పర్స్ బాయ్స్ కావలెను. 9గం. డ్యూటీ 4 w/o ESI+PF+మంచి జీతం. Ph: 9032153413 [H-796692]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కాజీపేట-దాదార్ మధ్య 26 ప్రత్యేక రైళ్లు

- వయా కరీంనగర్, మంచిర్యాల మీదుగా..
- ఈ నెల 16 నుంచి ప్రారంభం



కాజీపేట రూరల్: దసరా, దీపావళి పండుగల సందర్భంగా ప్రజల సౌకర్యార్థం కాజీపేట–దాదార్ మధ్య 26 ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను నడిపించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

కాజీపేట–దాదార్ (07195) ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 16, 23, నవంబర్ 13, 20, 27వ తేదీల్లో కాజీపేట నుంచి ప్రతి బుధవారం 15.00 గంటలకు బయలుదేరి గురువారం 13.25 గంటలకు దాదార్‌కు చేరుతుంది. దాదార్–కాజీపేట (07196) ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 17,24, నవంబర్14, 21, 28వ తేదీల్లో దాదార్‌లో ప్రతి గురువారం 15.25 గంటలకు బయలుదేరి శుక్రవారం 16.00 గంటలకు కాజీపేటకు చేరుతుంది. కాజీపేట–దాదార్ (07197) ఎక్స్‌ప్రెస్ కాజీపేట నుంచి అక్టోబర్ 12,19,26,నవంబర్ 2,11,16,23,30వ తేదీల్లో కాజీపేటలో ప్రతి శనివారం 11.30 గంటలకు బయలుదేరి ఆదివారం 13. 25 గంటలకు చేరుతుంది. దాదార్–కాజీపేట (07198) అక్టోబర్ 13,20,27, నవంబర్ 3,10,27,24, డిసెంబర్ 1వ తేదీన దాదార్‌లో ప్రతి ఆదివారం 15.25 గంటలకు బయలుదేరి సోమవారం కాజీపేటకు 21.30 గంటలకు చేరుతుంది. కాజీపేట–దాదార్–కాజీపేట (07195/07196) ఈ ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లకు జమ్మికుంట, పెద్దపల్లి, కరీంనగర్, లింగంపేట్, జగిత్యాల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్, బాసర, దర్మాబాద్, ఉమ్రి, ముద్కేడ్, నాందేడ్, పూర్ణ, పర్బానీ, సెలి, పర్టూర్, జైనా, ఔరంగాబాద్, లాసూర్, రొటేగాం, నాగర్‌సోల్, మన్మాడ్, నాసిక్, ఇగ్తాపూరి, కల్యాణ్ రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు.

కాజీపేట–దాదార్–కాజీపేట (07197/07198) ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లకు జమ్మికుంట, పెద్దపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్‌పూర్‌కాగజ్‌నగర్, బల్హర్షా, చంద్రాపూర్, బందక్, వాని, కయర్, లింగ్‌టి, పింపల్‌కూటి, ఆదిలాబాద్, కిన్‌వేట్, సహస్రఖండ్, హిమయత్‌నగర్, బోకర్, ముద్కేడ్, నాందేడ్, పూర్ణ, పర్బానీ, సెలు, పర్టుర్, జల్నా, ఔరంగాబాద్, లాసూర్, రోటేగాం, నాగర్‌సోల్, మన్మాడ్, నాసిక్, ఇగ్‌టాపురి, కల్యాణ్ రైల్వే స్టేషన్‌లో అప్ అండ్ డౌన్ హాల్టింగ్ కల్పించారు.

ఉత్కంఠ పోరులో ఖమ్మం విజయం

- సెమీస్‌కు చేరిన కరీంనగర్, ఖమ్మం జట్లు
- కొనసాగుతున్న అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ కేంద్రంగా కొనసాగుతున్న అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పూల్–బీ విభాగంలో కరీంనగర్ జట్టు మూడు మ్యాచ్‌ల్లో విజయం సాధించి సెమీస్‌కు చేరింది. నిజామాబాద్, ఖమ్మం జట్ల మధ్య గురువారం జరిగిన ఉత్కంఠ పోరులో అనూహ్య రీతిలో ఖమ్మం గెలిచి సెమీస్‌కు చేరింది. కోమటిపల్లి క్రీడా మైదానంలో నిజామాబాద్, ఖమ్మం జట్ల మధ్య కీలక మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నిజామాబాద్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు 45 ఓవర్లను ఎదుర్కొని 207 భారీ స్కోరు సాధించింది. ఓపెనర్‌గా ప్రతాప్ 48 పరుగులు చేయగా, విక్రాంత్‌రెడ్డి 98 బంతుల్లో 137 పరుగులు చేసి మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచాడు. అనంతరం 208 భారీ స్కోర్ లక్ష్యంగా బరిలోకి దిగిన ఖమ్మం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టంతో ప్రత్యర్థి స్కోరును అధిగమించింది. ఈ జట్టులో బ్యాట్స్‌మెన్ దివిన్ 75 పరుగులు, రత్న ఆర్యన్ 45 పరుగులతో రాణించి జట్టు విజయంలో కీలకంగా మారారు. చివరి బంతి వరకు నిజామాబాద్ జట్టుపై ఒక వికెట్ తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. మొగిలిచర్ల క్రీడా మైదానంలో ఆదిలాబాద్, కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు 46.3 ఓవర్లలో 165 పరుగుల వద్ద అన్ని వికెట్లు కోల్పోయింది. బ్యాట్స్‌మన్ విజ్ఞాన్ 59 పరుగులతో రాణించారు. అనంతరం 166 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆదిలాబాద్ 32.3 ఓవర్లలో 102 పరుగుల వద్ద ఆల్ అవుట్ అయి 63 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. బ్యాటింగ్‌లో 39 పరుగులు చేయడమే కాకుండా ఆదిలాబాద్ జట్టులో కీలకమైన 3 వికెట్లను తీసిన ఆల్‌రౌండర్ తక్షిల్ కరీంనగర్ జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. నేడు జరుగనున్న మొదటి సెమీస్‌లో మహబూబ్‌నగర్ వర్సెస్ ఖమ్మం, మరో సెమీస్‌లో కరీంనగర్ వర్సెస్ నల్లగొండ జట్లు తలపడనున్నాయి.

పాటలకు గంతేశారు..

- ఆకట్టుకున్న అన్యనాభాస్కర్ -అనుదీప్‌దేవ్ ప్రదర్శన
- ఎస్సార్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న వీసీ దీపక్‌గార్గ్

హసన్‌పర్తి: నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ గాయకులు అన్యనాభాస్కర్- అనుదీప్‌దేవ్ ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అన్యనా భాస్కర్-అనుదీప్ పాటలు పాడుతుండగా విద్యార్థులు గంతేశారు. తొలుత విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సమావేశంలో ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. అప్పుడే గమ్యం చేరుకుంటారన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని చెప్పారు. కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకశక్తులను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ముందు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ డాక్టర్ ఎ.వి.వి. సుధాకర్, స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ శశి, తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు



పాటలు పాడుతున్న గాయకులు

తొర్రూరులో 'కాసం' షాపింగ్ మాల్ ప్రారంభం



కాసం షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న సినీనటి ప్రియాంక మోహన్

తొర్రూరు: పట్టణంలోని వరంగల్ -ఖమ్మం రోడ్డులో కాసం షాపింగ్ మాల్ 13వ స్టోర్ ప్రారంభోత్సవానికి సినీనటి ప్రియాంక మోహన్ హాజరై సందడి చేశారు. ప్రారంభం అనంతరం మాల్‌లో కలియదిరిగి వస్త్రాలను పరిశీలించారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, మల్లికార్జున్, శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్టోర్‌లను విస్తరిస్తున్నామని, ఈ వారంలో నర్సంపేట, వనపర్తిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నాణ్యమైన ఫ్యాషన్ ఉత్పత్తులను సరసమైన ధరలకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.